మీ సేవలకు సలామ్

- నాణ్యమైన విద్యుత్ సరఫరాలో సిబ్బంది తలమునకలు
- ప్రాణాలకు తెగించి మరమ్మతు పనులు
- నిరంతరం విధి నిర్వహణలో..

విద్యుత్ సరఫరా నిలిచిపోయిందంటే ప్రతి ఒక్కరిలో అసహనం నెలకొంటుంది. ఈ తరుణంలో సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి సరఫరా ఎప్పుడొస్తుందని ఆరాతీయడం సర్వసాధారణం. ఒకవేళ వారు చెప్పిన సమయం కన్నా ఆలస్యమైతే మరింత అసహనానికి గురవుతుంటారు. అయితే క్షేత్ర స్థాయిలో ఆ శాఖ సిబ్బంది విధులు కత్తి మీద సాములాంటివి. వర్షాలు.. తుపాన్లు.. ఇలా పలు సమయాల్లో తమ ప్రాణాలకు తెగించి మరమ్మతు పనులను వారు చేస్తుంటారు. స్తంభాలెక్కి పనులు చేసే క్రమంలో పలువురు తమ ప్రాణాలను సైతం కోల్పోతుంటారు. అయినా తమ కర్తవ్యాన్ని సమర్థంగా నిర్వర్తిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలందిస్తున్నారు.





రాత్రీ, పగలనే తేడా లేకుండా విధులు నిర్వర్తిస్తున్న లైన్‌మెన్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రజలకు విద్యుత్ సరఫరాను నిరంతరం అందించడంలో ఆ శాఖ సిబ్బంది ఎంతో శ్రమిస్తున్నారు. తమ ప్రాణాలకు తెగించి విద్యుత్ స్తంభాలెక్కడం.. తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం.. మరమ్మతు పనులను చేస్తుంటారు. అత్యవసర విభాగాల్లో కీలకమైన ఈ శాఖ సిబ్బంది రాత్రయినా.. పగలైనా వెంటనే స్పందించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడుతున్నారు.

ఏ సమయమైనా అందుబాటులో..

ఫలానా ప్రాంతంలో సరఫరా నిలిచిపోయిందని ఫ్యూజ్ కాల్ ఆఫీస్‌కు వినియోగదారులు ఫోన్ చేస్తే, ఏ సమయమైనా సిబ్బంది వెళ్లి తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారు. మరింత విద్యుత్ అవసరమైన ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, లైన్లను అనతికాలంలోనే ఏర్పాటు చేస్తున్నారు. రొట్టెల పండగ, వినాయక నిమజ్జనం, పలు దేవస్థానాల రథోత్సవాలు.. ఇలా కార్యక్రమం ఏదైనా సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా.. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తమ విధులను సమర్థంగా నిర్వర్తిస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో సంభవించిన తుఫాన్ కారణంగా జిల్లాలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు నానా తంటాలు పడ్డారు. ఆ సమయంలో ఆ శాఖ సిబ్బంది రేయింబవళ్లు పనిచేసి సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించి కష్టాల నుంచి వారిని బయటపడేశారు. వీరి సేవలకు మనం సలామ్ చేయాల్సిందే.

సిబ్బంది ఇలా.. (ఉమ్మడి నెల్లూరు జిల్లాలో)

లైన్ ఇన్‌స్పెక్టర్లు	- 105
లైన్‌మెన్లు	- 438
అసిస్టెంట్, జూనియర్ లైన్‌మెన్లు	- 3317

ప్రజలతో బంధం ఏర్పడింది



విద్యుత్ శాఖలో పనిచేసే అవకాశం రావడాన్ని ఎంతో అదృష్టంగా భావిస్తున్నా. విధి నిర్వహణలో భాగంగా ప్రజలతో మంచి బంధం ఏర్పడింది. వినియోగదారులకు ఇబ్బంది తలెత్తకుండా ఎంతో కృషి చేస్తున్నాం.

– షరీఫ్, లైన్ ఇన్‌స్పెక్టర్

జీతానికి తగిన విధంగా విధులు నిర్వర్తించాలి



విద్యుత్ సంస్థలో పని చేసే ఉద్యోగులు తమ విధులను సమర్థంగా నిర్వర్తించాలి. ఇక్కడ ఉద్యోగిగా ఉంటూ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించటం ఎంతో ఆనందంగా ఉంది. కొన్ని సందర్భాల్లో ఇంటినీ, కుటుంబాన్ని సైతం మర్చిపోవాల్సి వస్తోంది.

– సుధాకర్, అసిస్టెంట్ లైన్‌మెన్

కరెంట్ పోతే ముందు మేమే గుర్తొస్తాం



ఒక్క నిమిషం కరెంట్ పోతే ప్రజలకు ముందు గుర్తొచ్చేది మేమే. కొన్ని సందర్భాల్లో కొందరు వినియోగదారులు తీవ్ర అసహనానికి గురై మాపై ఆగ్రహాన్ని ప్రదర్శిస్తుంటారు. అయినా అర్థం చేసుకొని సకాలంలో విద్యుత్ వచ్చేలా చర్యలు చేపడుతున్నాం.

– నరసింహారెడ్డి, జూనియర్ లైన్‌మెన్, గ్రేడ్ – 2

క్లుప్తంగా

మద్యం దుకాణాన్ని తొలగించాల్సిందే



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వాకర్స్ రోడ్డులో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని, లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని కాంగ్రెస్ నేత, న్యాయవాది సంజయ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక మహిళలు చేపట్టిన దీక్షకు ఆయన సంఘీభావాన్ని ప్రకటించారు. నేతలు సుధీర్, ఇర్ఫాన్, హుస్సేన్ బాషా, అజారుద్దీన్, దాసు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సాంబశివరావు

నెల్లూరు(క్రైమ్): పీజీలు, హాస్టళ్లలో సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని బాలాజీ నగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని పీజీ, హాస్టళ్ల నిర్వాహకులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఎప్పటి నుంచి నిర్వహిస్తున్నారు.. భద్రతపరంగా చేపడుతున్న చర్యలను ఆరాతీశారు. పీజీలు, హాస్టళ్లలో ఉంటున్న వారి సమగ్ర వివరాలతో రికార్డులను నిర్వహించాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే తక్షణమే 112 లేదా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు.

హక్కులు, చట్టాలపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: హక్కులు, చట్టాలపై మండలంలోని రామచంద్రాపురం గురుకుల పాఠశాలలో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. బేటీ బచావో.. బేటీ పడావో, గుడ్.. బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోషల్ కౌన్సెలర్ కమల మాట్లాడారు. ఏమైనా సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 181, 112కు సమాచారం అందించాలని కోరారు. ప్రిన్సిపల్ గీత, సిబ్బంది సుజాత, జ్యోతి, ప్రశాంతి, సాధన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఇందుకూరుపేట: ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆ దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని జగదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు కిశోర్‌కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు పేర్కొన్నారు. మండలంలోని ఆదెమ్మసత్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం వారికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను తప్పక పాటించాలి



మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ నిర్దేశించిన నిబంధనలను సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ నిర్వాహకులు తప్పక పాటించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాల నిర్వాహకులకు అనుమతులను మంజూరు చేస్తూ లైసెన్స్‌లను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో మంగళవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. వాహనాల ద్వారా సేకరించిన వ్యర్థాలను అల్లీపురం, హరనాథపురం, వెంకటేశ్వరపురంలోని మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో మాత్రమే వేయాలని ఆదేశించారు. పంట కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో వేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ అవసరమైన వారు 14420 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇంటింటి సర్వేకు సహకరించండి

ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శులకు సహకరించాలని కమిషనర్ కోరారు. సీఎం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సర్వేలో తమ ఇంటిని ప్రతి ఒక్కరూ మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 65 శాతం మేర మ్యాపింగ్ పూర్తయిందని వివరించారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈలు రహంతుజానీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనధికార మద్యం విక్రేత అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలో మద్యం అనధికార విక్రయాలపై దాడులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు – 1 అధికారులు మంగళవారం చేపట్టారు. బుజబుజనెల్లూరులోని బస్టాప్ వద్ద అనధికారికంగా మద్యాన్ని విక్రయిస్తున్న భగత్‌సింగ్ కాలనీకి చెందిన రమణమ్మను అరెస్ట్ చేశారు. ఆమె నుంచి తొమ్మిది క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు, ఎస్సైలు శ్రీధర్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం నగదు చెల్లించకుండా మోసం

- ఇద్దరి అరెస్ట్

నెల్లూరు సిటీ: ధాన్యాన్ని కొనుగోలు చేసి రోజులు గడుస్తున్నా, నగదును చెల్లించలేదంటూ బాధితుడు ఫిర్యాదు చేయడంతో ఇద్దర్ని నెల్లూరు రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. సౌత్‌మోపూరుకు చెందిన సతీష్ వద్ద ధాన్యాన్ని సిరి గార్డెన్స్‌కు చెందిన మనోజ్, శ్రీనివాసులురెడ్డి గతంలో కొనుగోలు చేశారు. దీనికి సంబంధించిన నగదును ఇవ్వకుండా కాలయాపన చేయసాగారు. ఇదే విషయమై పలుమార్లు కోరినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ తరుణంలో వీరిని అరెస్ట్ చేశారు.

రైతుల సమస్యలపై సంఘటిత ఉద్యమాలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): రైతుల సమస్యల పరిష్కారానికి గానూ సంఘటిత ఉద్యమాలు తప్పనిసరని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర నేత చిరసాని కోటిరెడ్డి పేర్కొన్నారు. రైతు కూలీ సంఘ రాష్ట్ర మహాసభల విశేషాలతో ప్రచురించిన సావనీర్‌ను సండేమార్కెట్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. గిట్టుబాటు ధరల్లేకపోవడం.. పెరిగిన వ్యవసాయ ఖర్చులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వీరి సమస్యలను పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి గంగపట్నం రమణయ్య మాట్లాడారు. సమస్యలను పక్కదారి పట్టించేందుకు పాలకులు యత్నిస్తున్నారని, తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం సైతం ఇదే కోవకు చెందుతుందని చెప్పారు. రైతు కూలీ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి సునీత, సంఘ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి రమణయ్య పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భారత రాజ్యాంగాన్ని పరిరక్షించి.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సంతపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. అదానీని విమర్శించే ధైర్యం చంద్రబాబుకు లేదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లో మూడు.. పట్టణాల్లో రెండు సెంట్ల భూమిని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సహాయ కార్యదర్శి మాలకొండయ్య, నగర కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి, సహాయ కార్యదర్శి సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బీజేపీ సంస్థాగత ఎన్నికలు



మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

నెల్లూరు రూరల్: బీజేపీ సంస్థాగత ఎన్నికలను త్వరలో నిర్వహించనున్నామని పార్టీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. ఆరు జిల్లాలకు పార్టీ రిటర్నింగ్ అధికారిగా తనకు బాధ్యతలను అప్పగించారని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, నేతలు కందికట్ల రాజేశ్వరి, మిడతల రమేష్, ప్రవీణ్, బైరి శ్రీనివాసులు, ప్రసాద్, మధు, భరత్‌కుమార్‌యాదవ్, నారాయణరెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



విద్యార్థులకు అభినందన

నెల్లూరు (టౌన్): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు రవీంద్రభారతి స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని స్కూల్ జోనల్ ఇన్‌చార్జి శ్రీహరి తెలిపారు. ఫతేఖాన్‌పేటలోని పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు గిరీష్, సల్మాన్, ఫైజాన్ రజాను అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్ – 17 పోటీల్లో వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని వివరించారు. ప్రిన్సిపల్ సుమలత, పీఈటీ వంశీ తదితరుల పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన



నెల్లూరు (టౌన్): ప్రకృతి వైపరీత్యాలు, మానవ తప్పిదాలతో సంభవించే ప్రమాదాలపై నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సును ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ హాజరయ్యారు. తుఫాన్, వరదలు,, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు తదితరాల నుంచి ఎలా బయటపడాలనే అంశమై శిక్షణ ఇచ్చారు. అనంతరం అత్యవసర కిట్‌ను కళాశాలకు అందజేశారు. ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు, ఎస్డీఆర్ఎఫ్ అధికారులు కరుణకుమారి, భారతి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వివాహిత అదృశ్యమైన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. గుంటూరుకు చెందిన ఓ యువతికి ఆత్మకూరు ప్రాంతానికి చెందిన శ్రీనుతో సుమారు నెల క్రితం వివాహమైంది. వివాహానంతరం ఉపాధి నిమిత్తం నగరంలోని ఎఫ్‌సీఐ కాలనీకి వీరు వచ్చారు. అక్కడ ఓ ఇంటిని అద్దెకు తీసుకొని పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పని ఉందంటూ ఇంటి నుంచి వెళ్లిన ఆమె సోమవారం అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..

ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వ్యక్తి అదృశ్యమయ్యారు. వివరాలు.. నవాబుపేటలోని శివాలయం వీధికి చెందిన వెంకటేశ్వర్లు ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఇంటి నుంచి ఈ నెల 15న అదృశ్యమయ్యారు. ఆయన కోసం కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లభించలేదు. దీనిపై నవాబుపేట పోలీసులకు ఆయన భార్య కల్పన ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి వివరాలు లభ్యం

నెల్లూరు(క్రైమ్): నగరంలోని నక్కలోళ్ల సెంటర్ సమీపంలో రైలు పట్టాలపై సోమవారం ఆత్మహత్య చేసుకున్న యువకుడ్ని రంగనాయకులపేటకు చెందిన మోహన్ (23)గా రైల్వే పోలీసులు గుర్తించారు. వివరాలు.. రంగనాయకులపేటలో నివాసం ఉంటూ చిల్లర దుకాణాన్ని నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా, చిన్న కుమారుడు మోహన్ డిగ్రీ వరకు చదువుకున్నారు. దుకాణంలో ఉంటూ తండ్రికి చేదోడువాదోడుగా ఉండేవారు. కొంతకాలంగా మతిస్థిమితం సక్రమంగా లేక బాధపడుతున్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అప్పుడప్పుడూ ఇంటి నుంచి వెళ్లిపోయి మరుసటి రోజు వచ్చేవారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున బయటకెళ్లి, రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

నెల్లూరు (లీగల్): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

- నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో గల బార్ అసోసియేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్, మాజీ కార్యదర్శులు రామిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణపై అధికారులు పెట్టిన అక్రమ కేసును కోర్టు కొట్టేయడంపై సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, రామ్‌ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఏపీజీఈఏ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేశారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఆర్ఐఓ శ్రీనివాసులు, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, ఎన్నెస్సెస్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, భారతి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ భవన్‌లో..



డీసీఓ కార్యాలయంలో..



డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో..

- డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి వాణి హాజరయ్యారు. రాజ్యాంగ పీఠికను విద్యార్థులతో చదివించి ప్రతిజ్ఞ చేయించారు. కోవూరు డిగ్రీ కళాశాల అధ్యాపకుడు సుదర్శన్‌కుమార్, డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమణరావు తదితరులు పాల్గొన్నారు.
- మినీబైపాస్‌లోని జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకుడు జకీర్ తదితరులు పాల్గొన్నారు.
- కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఏఎంఓ సుధీర్‌కుమార్, ఎంఈఓ మురళీధర్, హెచ్‌ఎం భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.
- బీవీనగర్‌లోని కేఎన్నార్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. నిర్మల్ హృదయ మదర్‌థెరిసా వృద్ధాశ్రమంలోని వారికి పండ్లు పంపిణీ చేశారు. ఎన్సీసీ అధికారి నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.
- దర్గామిట్టలోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ తిరుపాల్, హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు గురుమూర్తి, జయలక్ష్మి, గౌసియాబేగం, దీప్తి, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ: బుజబుజనెల్లూరులోని శేషు ఇంగ్లిష్ మీడియం స్కూల్లో కార్యక్రమాన్ని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్, పీహెచ్‌పీ అసోసియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్షేత్ర ప్రచార సహాయకుడు హరికృష్ణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కుడుముల సుబ్బారావు, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌ఈ విజయన్, నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్, అకౌంట్స్ ఆఫీసర్ విజిత, డీఈఈ అల్తాఫ్, పర్సనల్ ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

- డీసీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీఓ గుర్రప్ప, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు శ్రీలత, ఉమామహేశ్వరి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ



దర్గామిట్టలోని ప్రాథమికోన్నత పాఠశాలలో..



బార్ అసోసియేషన్ కార్యాలయంలో..



కొండాయపాళెంలోని స్కూల్లో..